


కమ్యూనిస్టులు గెలుపు - అభివృద్ధికి మలుపు

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 09 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 04

# సూర్యాపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాయం

## వర్గాలకు అతీతంగా పని చేయడం హర్షణీయం

## వైశ్య సామాజికవర్గ మహిళకు చైర్మన్‌గా ప్రకటించడం శుభసూచికం


## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం /సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటిలోని 48వార్డుల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు విజయం సాధించి చైర్మన్ పిఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల నుండి ప్రారంభమైన మోటార్ సైకిల్ ర్యాలీ పాత బస్టాండ్, పూలసెంటర్, పొట్టిశ్రీరాములు సెంటర్, రాఘవప్లాజ, వాణిజ్యభవన్, శంకర్ విలాస్ మీదుగా గాంధీ విగ్రహంకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక చైర్మన్ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో సూర్యాపేటలో ఉన్నవర్గాలకు పక్కన పెట్టి మున్సిపల్ ఎన్నికల్లో నేతలు కలిసి పని చేయడం హర్షణీయమన్నారు. గత రెండు పర్యాయాలు బిఆర్ఎస్ పార్టీ వైశ్య సామాజిక వర్గానికి ఓటు బ్యాంకుగా చూశారే తప్పా.. వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ గా వైశ్య సామాజిక వర్గానికి చెందిన 46వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మోరిశెట్టి నివేధిత లక్షాదిని ప్రకటించడం శుభసూచికమన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధిలో వెనుకబడిన పట్టణంలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో దొడ్డు బియ్యం అందించడంతో 12వేల కోట్లు వృదా అయ్యేవని వాటిని సద్వినియోగం చేసుకునేందుకే సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను నేను తీసుకుంటానని తెలిపారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యంలో రాష్ట్రానికే ఆదర్శవంతంగా సూర్యాపేట ఉండేలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపిలకు ఓట్లు వేస్తే అది మోరీలో వేసినట్లు అవుతుందన్నారు. రానున్న మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఏలాంటి వర్గాలకు తావులేకుండా నేతలు ఐక్యంగా పని చేయడం హర్షణీయమన్నారు. ఈనెల 11న జరిగే ఎన్నికల్లో 48 వార్డుల్లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల చెయ్యి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, ముదిరెడ్డి రమణారెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్, ధరావత్ వెంకన్న నాయక్, కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైక్ మోతలకు బ్రేక్



## గుర్తు.. గుర్తుంచుకో...

## నడువు... నడువు నడవవే రమక్క... పాటలు బంద్

## బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు

## ఎన్నికల ప్రచారం అంతా గప్ చుప్

## ఈరోజు సాయంత్రం వరకే మున్సిపల్ ప్రచారం

**ప్రజాపక్షం/నల్లగొండ:** గుర్తు.. గుర్తుంచుకో... గుర్తును గుర్తుంచుకో...నినాదాలు చేస్తూ ఎన్నికలో నిలబడ అభ్యర్థులు తమ ఓటర్లను ఆకట్టుకునే విధంగా నడువు... నడువు నడవవే రమక్క... మైక్‌లో వచ్చే పాటలకు ఈరోజు సాయంత్రం నుంచి బ్రేక్ పడింది.జెండాలు..పార్టీ గుర్తుల కండువాలు.. బ్యార్జీలు.. ఎలాంటి బహిరంగ సభలు,సమావేశాలు,ఊరేగింపులు లాంటివి ఈరోజు సాయంత్రం 5గంటల వరకు అవకాశం సమయం దాటితే అని పక్కన పేటి గుంపులు గుంపులుగా కాకుండా అభ్యర్థులు ఓటరును కలసి ఓటు అభ్యర్థించుకోవాలి. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది.పోలింగ్ ముగిసే సమయానికి ముందు నిర్దేశించిన 48 గంటల నుంచే ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని స్పష్టం చేసింది. ఈమేరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 11వ తేదీన ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని అధికారులు తెలిపారు.పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచే ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు.పోలింగ్ ప్రాంతాల్లోని ఓటర్లను ఆకర్షించే ఉద్దేశంతో చేపట్టే ఏ కార్యక్రమమైనా నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. సోషల్ మీడియా,డిజిటల్ మాధ్యమాలు,ముద్రిత ప్రకటనలు,ఆడియోవీడియో ప్రచారాలు సహా అన్ని రకాల ప్రచారాలకు పూర్తిగా బ్రేక్ ఉండాలని అధికారులు తెలిపారు.



# రెండేండ్లలో అభివృద్ధి శూన్యం

## మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ పార్టీకి నమ్మి ప్రజలు ఓటేసి అధికారంలోకి తీసుకవస్తే రెండేండ్లలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఆదివారం సూర్యాపేట మున్సిపాలిటిలో 44, 46, 14తోపాటు పలు వార్డుల్లో తమ పార్టీ నుంచి పోటీచేసిన కల్నల్ సంతోష్ తల్లి బిక్కుమళ్ళ మంజుల, బావు సింగ్, గాలి సాయికిరణ్ గెలిపించాలని కోరుతూ ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలలో రూ.2వేల ఫించన్‌ను రూ.4వేలు ఇస్తామని, మహిళలకు రూ.2500 ఫించన్, ఆడపిల్లలకు స్కూటీలు, జాబ్‌కార్డు, రైతుబంధు, రైతుభీమాలు ఏమయ్యాయని ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. సూర్యాపేట పట్టణములో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప చేసింది ఏమిలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి రాంచందర్ నాయక్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 10,11 స్థానిక సెలవు దినం

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ



**ప్రజాపక్షం/నల్లగొండ:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కై వినియోగించుకుంటున్న అన్ని విద్యాసంస్థలు,ప్రభుత్వ భవనాలు,ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ పోలింగ్ ముందు రోజైన ఫిబ్రవరి10,పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నెల 11న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు, మిర్యాలగూడ, హాలియా,నందికొండ,చండూరు,దేవరకొండ,చిట్యాల మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ మున్సిపాలిటీలలో పోలింగ్ నిర్వహణకై వినియోగించుకుంటున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు,విద్యాసంస్థలకు,ఇతర భవనాలకు పోలింగ్ ముందు రోజు,పోలింగ్ రోజున రెండు రోజులు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న నిడమనూరుకు చెందిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు ఈ నెల 11 నుండి 13 వరకు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.కాగా నిడమనూరుకు చెందిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల జిల్లా కేంద్రం సమీపంలో (రామానంద తీర్థ సంస్థ) పనిచేస్తున్న విషయం తెలిసిందే.ఈపాఠశాలలో ఈనెల 13న దేవరకొండ, చండూరు,చిట్యాల మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు కౌంటింగ్ కేంద్రంగా ఎంపిక చేయడం జరిగింది.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వారి ద్వారా షిలోహు మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ రోడ్డులోని షిలోహు మినిస్ట్రిస్ చర్చిలో నిర్వహించే ఉచిత వైద్య శిభిరంను మండల పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ దేవకుమార్ తెలిపారు. ఈ వైద్య శిభిరంలో ఉచిత రక్త పరీక్షలు, దంత పరీక్షలు, బిపి పరీక్షలు, షుగర్ పరీక్షలు, ఎక్స్‌రే, ఈసిజి, అర్హులైన వారికి ఉచిత కళ్ళ జోడులు గర్భిణి స్త్రీలు, పిల్లలకు పరీక్షలు నిర్వహించబడతాయని పాస్టర్ దేవకుమార్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు కూడా పంపిణి చేయబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ వైద్య శిభిరంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ సమగ్రాభివృద్ధి జరగాలంటే మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డిలు పిలుపునిచ్చారు. పట్టణంలోని 15, 17, 35 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి వారు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపిస్తూ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలకు మభ్యపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాప్‌లో పేరుతో రైతులకు యూరియా కష్టాలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** యాప్‌ల పేరుతో రైతుల కష్టాలు పడుతున్నారని, రైతులను ఇబ్బందులు పెట్టడం సరైంది కాదని టిడిపి మండల అధ్యక్షులు కీసర నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టడం సరైంది కాదని, ప్రతి రైతు వద్ద స్మార్ట్‌ఫోన్ లేవని, ఉన్న వారికే నెట్ సౌకర్యం లేదన్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, బుకింగ్ చేసుకోవడం ఒటిపి విధానం రైతులకు తెలియదని అన్నారు. రైతులు పెద్దగా చదువుకోవడం రాదని, వారికి వచ్చేది ఒక్కటే వ్యవసాయం చేయడం తెలుసునని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్, పాటకోటి లింగారెడ్డి, పశ్య సీతరాంరెడ్డి, మీరా పాండు, మామిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సైదులు మృతి బాధకరం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** యల్లబోయిన సైదులు మృతి బిఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటు అని, బిఆర్‌ఎస్ పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణానాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెంకట్రాపురం గ్రామానికి చెందిన యల్లబోయిన సైదులు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు వీరంరెడ్డి శంభిరెడ్డి, గాలి రామకృష్ణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని పరీక్షలు మంచిగా రాయాలని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఊర్మిళరాణి పాత్రో ఆర్థిక సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు ఆసన్నమవుతున్న నేపథ్యంలో విద్యార్థులంతా ప్రణాళికబద్ధంగా పరీక్షలకు హాజరయ్యేందుకు సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థులందరు మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండాలని, ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలను చదువుకోవాలని సూచించారు. ఈ ఏడది ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలో పది జీపీఏ సాదించిన ప్రతి విద్యార్థికి తమ సంస్థ ద్వారా రూ.2వేల నగదు పారితోషికం, మెమెంటో అందిస్తామని హామి ఇచ్చారు. ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్, హెడ్ మాస్టర్ సుజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోదాడలో బిజెపి జెండా ఎగరడం ఖాయం



**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు**

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణను దోచుకుంటున్న బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు అన్నారు. కోదాడ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన రంగా థియేటర్ చౌరస్తా వద్ద కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలకు పాల్పడుతుందని, మరోవైపు బిఆర్‌ఎస్ అవినీతిలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, కొప్పుల నర్సింహారెడ్డి, మురళిధర్‌రెడ్డి, వంగవీటి శ్రీనివాస్, బండారు కవితారెడ్డి, అంజియాదవ్, బొలిశెట్టి కృష్ణయ్య పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల 50 వసంతాల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ఆత్మకూరు(ఎం) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988/89 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులందరికీ 50 వసంతాల వయసు దాటడంతో ఆదివారం మండల కేంద్రంలో 50 వసంతాల ఆత్మీయ కలయికతో పాటు, ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులందరికీ ఒకచోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందంటూ, పూర్వ విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆటపాటలతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న లోడి భాస్కర్ గౌడ్ మొరిపిరాల గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా ఎన్నికైన యాస జనార్దన్ రెడ్డిని ఈ సందర్భంగా బాల్య మిత్రులు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరికీ జ్ఞాపికలను అందజేశారు.

## తారక్ డయాగ్నోస్టిక్ సెంటర్ నందు ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం తుర్కపల్లి గ్రామంలో గల తారక్ డయాగ్నొస్టిక్ సెంటర్ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తారక్ డయాగ్నొస్టిక్ సెంటర్ , చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం నందు తుర్కపల్లి గ్రామ , పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా బిపి, షుగర్ న్యూరోపతి పరీక్షలు నిర్వహించి ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజకుమార్‌చే ఉచిత కన్సల్టేషన్ నిర్వహించారు. తదనంతరం డాక్టర్ సలహా మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు 100 మంది వరకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తారక్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు కొండల్ రెడ్డి మరియు పడిగం భానుశంకర్ తెలియజేశారు. శ్రీ ఆర్కే హాస్పిటల్ డాక్టర్ చావా రాజ్ కుమార్‌కి , వారి బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వతంత్ర అభ్యర్థి గంట్ల అనంతరెడ్డి భారీ ర్యాలీ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ కార్పొరేషన్ 36వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా గంట్ల అనంతరెడ్డి ఆదివారం భారీ ర్యాలీ తీసి విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా అతను మాట్లాడుతూ నల్లగొండ కార్పొరేషన్‌లో 36వ డివిజన్ అభివృద్ధికి తాను కట్టుబడి పనిచేస్తానని, గత 20 సంవత్సరాలుగా ఛాయస్ సమస్యలయాన్ని ఏవిధంగా అయితే అభివృద్ధి చేశానో అదేవిధంగా డివిజన్ కూడా అభివృద్ధి చేస్తానని మరియు ఇచ్చిన మేనిఫెతస్టో హామీలను కచ్చితంగా అమలు చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో గంట్ల అనంతరెడ్డి,పద్మ, యాట సునీత, మాధవి,అనూష,రజిత,హేమలత,ఎ లిజాల శంకర్,సాయి చరణ్,లవ కుమార్,పర్వత రెడ్డి, కాల నీవాసులు, రుద్రసేన సభ్యులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ జెండా ఎగురేద్దాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాల్సిన సమయం ఆసన్నమైందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. 2వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి శాగా జయలక్ష్మి, 13వ వార్డు అభ్యర్థి శాగా జలంధర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీల అభివృద్ధి జరిగిందన్నారు. పుర ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం పాటుపడే నాయకులను ఎన్నుకుంటే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

## కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంపిణి చేసి మాట తప్పిన కాంగ్రెస్‌ను ఓటు అనే వజ్రాయుధంతో ఓడించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్థ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం 1, 4, 13, 14, 20 వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డు చూపించాలన్నారు. మిర్యాలగూడ పట్టణం సమగ్ర అభివృద్ధి జరగాలంటే గులాబీ జెండా ఎగిరే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధనావత్ చిట్టి బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బొల్లం విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/కోదాడ:** కొండ నాలుకకు మందు వేస్తే ఉన్ననాలుక ఊడిందన్నట్లుగా నేడు తెలంగాణలో కాంగ్రెస్ పాలన సాగుతొందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం కోదాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటి పరిధిలో 12, 13, 14, 15, 16 వార్డులలో కారు గుర్తుపై ఓటు వేసి బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు ఎస్‌కె నయీం, అభ్యర్థులు కరీముల్లాబాబా, లక్ష్మి , కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్రాభివృద్ధి బిఆర్‌ఎస్‌తోనే

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** గ్రామాల్లో మౌలిక వసతులు సమగ్ర అభివృద్ధి జరిగింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా ఆయన ఆదివారం పోచంపల్లి పట్టణ మున్సిపాలిటీ కౌన్సిలర్ చైర్మన్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 13వ వార్డులలో ఆయన మెరుపు ప్రచారం చేశారు. ఇంచార్జ్ నంద్యాల దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాదుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ పిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, 8వ వార్డు మాజీ కౌన్సిలర్ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి ఉన్నారు.



# నేటి నుండి 'యాప్' తోనే యూరియా పంపిణీ

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు మండలంలోని రైతులందరికీ వ్యవసాయ శాఖ కీలక సూచన చేసింది. మండలంలోని అన్ని గ్రామాల రైతులు రేపటి నుండి యూరియాను కేవలం యాప్ ద్వారా బుక్ చేసుకున్న తర్వాతే పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా సుల భంగా బుక్ చేసుకో వచ్చని తెలిపారు. బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే ప్రాధాన్యత క్రమంలో యూరియా పంపిణీ చేయబడుతుందని స్పష్టం చేశారు.

# సమ్మెను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/నకిరేకల్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల12నతలపెట్టినదేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఒంటెపాక వెంకటేశ్వర్లుపిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం పల్స సైదులు అధ్యక్షతననిర్వహించారు.ఈ సమావేశంలో ఆసంఘం నాయకులు పొడిచేటి నాగమణి,తాడ్వాయి రాములు,సూరారపు వీరయ్య,వెంకటమ్మ,లక్ష్మయ్య,బి.శీను,నాగార్జున, వసంత,రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్

**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని జడ్‌పిహెచ్‌ఎస్ హైస్కూల్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు.ఈసందర్భంగా ఆ సంఘం డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కోసమే ఈటాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందన్నారు.భవిష్యత్ పరీక్షలకు సిద్ధం చేయడమేపరీక్షలక్ష్యమన్నారు.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పరీక్ష రాశారని తెలిపారు. ప్ర శాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించడంతోవిద్యార్థులు తమ ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించారని పేర్కొన్నారు.

# ఆపదలో మిత్రుడికి అండ

**ప్రజాపక్షం/నకిరేకల్:** ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా జడ్‌పిహెచ్‌ఎస్ శాలిగౌరారం ఎస్‌ఎస్‌సి2003 బ్యాచ్ నిలిచారు. ఎస్‌ఎస్‌సి పూర్తి చేసిన తోట సోమేష్‌కు ఇటీవల గుండె సంబంధిత స్టంట్ ఆపరేషన్ జరగగా,విషయం తెలుసుకున్న ఆబ్యాచ్ చెందిన స్నేహితులు స్పందించి.ఆబ్యాచ్ ఆధ్వర్యంలో రూ.30వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి సోమేష్‌ను పరామర్శించారు.ఈసందర్భంగా అతని కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మిత్రులు భరోసా ఇచ్చారు.

# అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా యల్లపురెడ్డియాదగిరిరెడ్డి

**ప్రజాపక్షం/నకిరేకల్** :నకిరేకల్ పట్నంలోని ఆఫీసర్స్ కాలనీ 13వ వార్డు అభివృద్ధి కమిటీని ఆదివారం సత్య సాయి ఫంక్షన్ హాల్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులుగా యల్లపురెడ్డియాదగిరి రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా పొరెట్ల వెంకట్‌ఆర్థికకార్యదర్శి,పొట్టబత్తుల లోకనాథం , తోపాటు గౌరవ సలహాదారులుగా పోతులసునితరవిందర్,పోతుల వెంకట నారాయణ,గుర్రం అంతయ్య,క్రిష్ణారెడ్డి,అర్రూరి వెంకటేశ్వర్లు,పుట్ట వెంకట్రాములు,పూర్ణచందర్ రావు బెజవాడ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం చైర్మన్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గ ప్రజల కోసం ముఖ్యమంత్రితో హెచ్‌ఎండిఏ నిధులు రూ.57 కోట్లు మంజూరు చేయించి గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. పచ్చల కట్ట సోమేశ్వర ఆలయం వచ్చే భక్తులకు మెయిన్ రోడ్డు నుండి ఆలయం వరకు సిసి రోడ్డు నిర్మాణం వెడల్పు కార్యక్రమం చేపడతామన్నారు. ఆలయ పరిసర ప్రాంతంలో ఆలయం చుట్టూ సీసీ రోడ్డు, వీధిలైట్లు, భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పట్టణ ప్రజలు 35 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టిటిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, భువనగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేష్, మాజీ కౌన్సిలర్ పడగల రేణుకా ప్రదీప్ పాల్గొన్నారు.

# అధికార కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక మున్సిపాలిటిలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరుగుతుందని, అధికార పార్టీని గెలిపించడం ద్వారానే తమ వార్డులను అత్యాద్భుతంగా అభివృద్ధి చేసుకోవచ్చని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, ఈడుపుగంటి సుబ్బారావు, దొంగరి వెంకటేశ్వర్లు లు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 16వ వార్డులో బిఆర్‌ఎస్ పార్టీ నుండి కుక్కడపు రామకృష్ణగౌడ్, నక్క బాలుగౌడ్ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం 16వ వార్డు అభ్యర్థి కారింగుల విజయ వెంకటేశ్వర్లు గెలుపును ఆకాంక్షిస్తూ డప్పు చప్పుళ్లతో కళాకారుల నృత్యాలతో వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కుక్కడపు మహేష్, చిన్నం శ్రీనివాసరావు, సిపిఐ సీనియర్ నాయకులు కొనుగుపాటి వాసుదేవరావు, బత్తిని వీర ప్రసాద్, సిపిఎం నాయకులు పల్లా వెంకటరెడ్డి, పోసనబోయిన హుస్సేన్, చెరుపల్లి నరేష్, అప్పనబోయిన సతీష్, రాచకొండ సుజిత్, ఎస్‌కె గౌస్‌పాషా, పిన్నెల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

# డప్పు కొట్టి దరువేసిన మొరిశెట్టి నివేదితలక్షాది



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : 46వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా పోటీచేస్తున్న ఆ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి మొరిశెట్టి నివేదితలక్షాది ఆదివారం తాను పోటీచేస్తున్న వార్డులో జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డప్పు కళాకారులతో ప్రచారం నిర్వహించిన ఆమె డప్పు కొట్టి దరువేసి వార్డు ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తనను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూర్యాపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ పేరుతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల సుదర్శన్ రెడ్డి, నూకల మధుసూదన్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, కక్కిరేణి శ్రీనివాస్, మొరిశెట్టి కోటేశ్వరరావు, నూనె సత్యనారాయణ పాల్గొన్నారు.

# 18వ వార్డును ఆరోగ్య వార్డుగా తీర్చిదిద్దుతా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : వార్డును ఆరోగ్య వార్డుగా తీర్చిదిద్ది అభివృద్ధిలో ఆదర్శంగా ఉంచుతానని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.



# పురోహిత బ్రహ్మ బిరుదుల ప్రదానం

**ప్రజాపక్షం/దేవరకొండ**; దేవరకొండ నియోజకవర్గ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురోహిత బ్రహ్మ అనే బిరుదును ఆరు గురు బ్రహ్మణులకు ఇవ్వడం జరిగింది. పరాభవనామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డా. శ్రీనివాస్ శాస్త్రీ హాజరై అవార్డు గ్రహీతలకు అవార్డులు, బిరుదులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కురిమేటి రవిప్రసాద్ శర్మ, కార్యదర్శి శ్రీనివాస్‌శర్మ, గౌరవ అధ్యక్షులు కృష్ణమూర్తి, కన్వీనర్ వంశీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.



# జోరుగా కొండపల్లి ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేట పట్టణంలోని 31వ వార్డు నుండి బిఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన కొండపల్లి సాగర్ రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా చేస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయం తక్కువగా ఉండడంతో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతూ ముందుకు సాగుతున్నారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం వార్డులో ఆయనకు ఉన్న సత్సంబంధాలతో ఇంటింటికి వెళ్ళి తన కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. తనను గెలిపిస్తే వార్డులో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేయించడంతోపాటు దోమల, పారిశుద్ధ్య సమస్య పరిష్కరిస్తానని హామీల వర్షం కురిపిస్తున్నారు. పనిలో పనిగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు వాటిని ఓ డైరీపై రాసుకొని గెలిచిన వెంటనే పరిష్కరిస్తానంటూ చెప్పుకొస్తున్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరిస్తున్నారు.

# బిజెపి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా వీరవెల్లి ఉమ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : బిజెపి సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా 40వ వార్డు నుండి ఆ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన వీరవెల్లి ఉమను తుంగుతుర్తి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. కాంగ్రెస్ తన చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన మొరిశెట్టి నివేదిత లక్షాదిని అధికారికంగా ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. ఇదే దారిలో బిజెపి కూడా ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన ఉమను ప్రకటించడం గమనార్హం. ఈమెకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. సామాన్య కుటుంబానికి చెందిన వారు. బిజెపి కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తేనే సూర్యాపేట అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/మునగాల:** ఒకటి కాదు రెండు 18 సంవత్సరాల తర్వాత బాల్య స్నేహితులు ఒకచోట కలుసుకున్నారు. హాయ్‌రా ఎలా ఉన్నావు ఏం చేస్తున్నావ్, నిన్నుచూసి చాల కాలమైంది. చాల మారిపోయావ్ అని ఆదివారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం హైస్కూల్‌లో విద్యార్థులంతా ఒక చోట చేరి ఒక వేదికలో ఇలా మాట్లాడుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను గంగయ్య, హమీద్, కె. వెంకటేశ్వర్లు, సాదె లక్ష్మి నారాయణ, అరె వీరారెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గండు మహేష్, శ్రీకాంత్, వీరబాబు, లింగయ్య, నరేష్, బ్రహ్మం, సుందరయ్య, సైదులు, బడేమియా పాల్గొన్నారు.

# స్టోరేజ్ సంపులో పడి యువకుడు మృతి

**ప్రజాపక్షం/డిండి**; డిండి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ప్రవీణ్ (18) యువకుడు ఆదివారం ఎర్రగుంటపల్లి గ్రామంలోని తమ వ్యవసాయ పొలం వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాహం వేయడంతో పొలంలోని వాటర్ స్టోరేజ్ సంపు వద్ద నీళ్లు తాగడానికి వెళ్లగా కాలు జారి సంపులో పడగా ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు, తల్లిదండ్రులు తెలిపారు. చేతికొచ్చిన కుమారుడు ప్రమాదవశాత్తు అర్థాంతరంగా మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



## పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం

ప్రజాపక్షం/నకిరేకల్ : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి ప్రజా గాయని పుష్ప జన్మదినాన్ని పురస్కరించుకుని నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మురారి శెట్టి ఉమారాణి కృష్ణమూర్తి సహకారంతో సెంటర్‌లో ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి అన్నదానం అందజేశారు. మున్సిపాలిటీ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ స్థానిక కౌన్సిలర్లతో కలిసి కేక్ కట్ చేశారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్,కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్,బానోత్ వెంకన్న, పోతుల రవి, చౌగోని లక్ష్మణ్,లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాణాల రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాపక్షం/చింతలపాలెం: గుడిమల్కాపురం సబ్ స్టేషన్ నందు సోలార్ ప్లాంట్ కోసం కొత్తగా 11కెవి విద్యుత్ లైన్ వేస్తున్న సందర్భంగా 11 కెవి తమ్మారం ఫీడర్ ప్రాజెక్ట్ వైపు, 11కెవి ప్రాజెక్టు ఫీడర్ నెమలిపురి కాలనీవైపు, సోమవారం, మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఎఇ సైదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉర్సు ఉత్సవాలు



ప్రజాపక్షం/మఠ్ంపల్లి : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో జరుగుతున్న హజ్రత్ సయ్యద్ సలీం సలార్ జంగ్ బాబా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలకు వస్తున్నటువంటి భక్తులను దృష్టిలో ఉంచుకొని గత ఏడు సంవత్సరాలుగా మండల పరిధిలోని రాజపేట తండా గ్రామానికి చెందిన కొడాల బ్రదర్స్ స్థానిక సర్పంచ్ కొడాల వెంకట్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడాల అల్వాల్ రెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీతారాం నాయక్,ఖదీర్ సాలార్, కొండల్,జాల వెంకటయ్య,సీత యాద య్య, సుంకరి మల్లేష్, శివకుమార్,మహేష్, పాల్గొన్నారు.

## కోతుల పట్టివేతకు సాయం

ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండల కేంద్రంలో గతకొన్ని రోజులుగా ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి సహకారంతో కోతుల సమస్యను పరిష్కరించే క్రమంలో తనవంతు సహాయంగా గ్రామానికి చెందిన బిజెవైఎం వైస్ ప్రెసిడెంట్, గోగికర్ శ్రీను అరటిపండ్లను అందచేసి కోతుల సమస్య పరిష్కారానికి కృషి చేశాడు. ప్రతి రోజు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, కోతులు పట్టేవారికి ప్రతి ఒక్కరు సహకరించాలని, త్వరలో కోతుల సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ పాలకవర్గానికి అరటిపండ్లు అందచేసి తన సహకారాన్ని అందచేసిన శ్రీను ను సర్పంచ్, ఉపసర్పంచ్ అభినందించారు.

# ప్రభుత్వ విద్యా సంస్థల సామగ్రిపై రూ.100 కోట్ల స్కామ్!

**2028 ఎన్నికల్లో బిసి నేతలే సిఎం...**
**తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు...**



ప్రజాపక్షం/ సూర్యాపేట : ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాసం కోసం అందించే సామాగ్రిపై రూ.100 కోట్ల స్కామ్ జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో విడుదలైన రూ.44 కోట్లలో రూ.40 కోట్లను మాజీ సీఎం కేసీఆర్,స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిలు కలిసి మాయం చేశారని ఆయన ఆరోపించారు అదే తంతుని కొనసాగిస్తూ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.100 కోట్ల స్కామ్‌కి పాల్పడిందని ఆరోపించారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో జానయ్య యాదవ్ సూర్యాపేటగా ఎమ్మెల్యేగా కాబోతున్నారని జోష్యం చెప్పారు. ఈ సభలో టిఆర్పి జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా కార్యదర్శి మీర్ అక్బర్,రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ,పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు : టిజెఎస్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : అభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్ రెడ్డి తెలిపారు.ఆదివారం టీజేఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతలు,ప్రతిపక్ష పార్టీలకు ఓట్లు వేస్తే అభివృద్ధి జరగదని,ప్రజలు ఈ విషయాన్ని ఆలోచించి అభివృద్ధి చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.మున్సిపాలిటీలు,కార్పొరేషన్లలో ఉన్న సమస్యలను జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమావేశం అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి సమస్యలపై విజ్ఞాపన పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్,జిల్లా ఉపాధ్యక్షులు రావూరి క్రాంతి కిరణ్,కార్యదర్శులు పులి పాపయ్య, కే.కిరణ్,జగనాదం తదితరులు పాల్గొన్నారు.



## రాజేష్ మృతి ముమ్మాటికి పోలీసుల వేధింపులే

**బిజెపి నేత ఎన్.రామచందర్‌రావు**

ప్రజాపక్షం/కోదాడ: దళిత యువకుడు కర్ల రాజేష్ మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని, ఇది పోలీసుల అతి ప్రవర్తన వల్లే జరిగిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు ధ్వజమెత్తారు. ఆదివారం కోదాడలో రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాజేష్‌ను అక్రమంగా నిర్భందించి కోర్టులో హాజరుపర్చకుండా నాలుగు రోజుల పాటు చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని చెప్పుకునే ప్రభుత్వం, దళితులపై జరుగుతున్న ఇలాంటి దాడులను సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హ్యూమన్‌రైట్స్ కమిషన్, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, కొప్పుల నర్సింహారెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్ష ఎన్నిక



ప్రజాపక్షం/చింతలపాలెం: మండల పరిధిలోని 16 గ్రామాలకు సంబంధించి ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునిగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి (దొండపాడు), ఉపాధ్యక్షునిగా సూరంశెట్టి ధనలక్ష్మి హనుమంతరావు (శోభనాద్రిగూడెం), ప్రధాన కార్యనిర్వాహణ అధికారిగా రామిశెట్టి హరిష్ (వజినేపల్లి), గద్దం రాజశేఖర్ (రెబల్లె), ను అందరు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ సభ్యులుగా జంగాల అనంతమ్మ, నర్సింహారావు, ఆంజనేయులు, శివారెడ్డి, శంభిరెడ్డిలను ఎన్నుకున్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

**బందోబస్తు నిర్వహణకు 1250 మంది పోలీస్ సిబ్బంది**
**ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి**
**సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ్మ**



ప్రజాపక్షం/సూర్యాపేట: ఈనెల 11వ తేదీన సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీకి జరగనున్న రెండవ సాధారణ మున్సిపాలిటి ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుందని ఎన్నికలను ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీస్ నిఘా ఉన్నదని అన్నారు. ప్రలోభాలను నిర్మూలించి ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. దీనికోసం ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అదనపు ఎస్పి లు, డిఎస్పిల ఆధ్వర్యంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అప్రమత్తంగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని కోరారు. ఐదు మున్సిపాలిటి కేంద్రాలలో 1250 మంది పోలీస్ సిబ్బందితో రక్షణ బందోబస్తు నిర్వహణకు ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. ఐదు మున్సిపాలిటి కేంద్రాలలో 141 వార్డులకు గాను 372 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా 115 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా మున్సిపాలిటి కేంద్రాలలో సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని, ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి మున్సిపాలిటి పరిధికి అదనపు ఎస్పి, డిఎస్పి స్థాయి అధికారి, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారిగా ఉంటారు. అలాగే ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్ విధులు నిర్వహిస్తుందని అన్నారు.

**కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఎలక్షన్ సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ**

ఐదు మున్సిపాలిటి కేంద్రాలలో జరగనున్న ఎన్నికలను జిల్లా ఎ లక్షన్ సెల్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, బందోబస్తు నిర్వహణ మొదలుకొని ఎన్నికల సామాగ్రికి భద్రత కల్పించే వరకు ప్రతిఅంశాన్ని ప్రణాళిక బద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సిసి కెమెరాలను జిల్లా పోలీస్ కార్యాలయం నందు నుండి నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా సిసి కెమెరాల నిఘాలో ఉన్నది.

**ప్రచార సమయం ముగిశాక ప్రచారం చేయొద్దు**

ఈనెల 9 సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల ప్రచార సమయం ముగుస్తుందని, ఎన్నికల ప్రచార సమయం ముగిశాక అభ్యర్థులు ఎవరు కూడా ప్రచారం నిర్వహించకూడదని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే ఎలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కేసులు నమోదైతే అభ్యర్థిత్వం కోల్పోతారని, సోమవారం సాయంత్రం నుండి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సైలెన్స్ డేగా పరిగణించడం జరుగుతుందని, ఈ సమయంలో ఓటర్లు గాని, వారి స్థానికేతరులు కాలనీలు వార్డులో సంచరించరాదని, ఉండకూడదని హెచ్చరించారు. ఓటర్లు మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలి అన్నారు. అంతేకాని ఉచితాలు, బహుమతులు, డబ్బు, మద్యం లాంటి వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

**స్వాధీనం, బైండోవర్ :** అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిని గుర్తించి 311 కేసుల్లో 450 మం ది ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగిందని, గత స్థా నిక సంస్థల ఎన్నికల సమయంలో 1488 మందిని బైండోవర్ చేశామని, ఎవరు కూడా బైండోవర్ నిబంధన ఉల్లంఘించరాదని, బైండోవర్ అంటే సత్‌ప్రవర్తన కోసం ఇచ్చే హామీ పత్రమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అలాం టి వారిని హామీ పూచికత్తు నగదు ఐదు లక్షల వరకు జరిమానగా వేయడం జరుగుతుందని హెచ్చరించారు. లైసె న్స్ కలిగిన 71 ఆయుధాలను తాత్కాలికంగా స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. 47 కేసుల్లో రూ.2.80 లక్షల విలువైన 496లీటర్ల మద్యం సీజ్ చేశామని తెలిపారు.

**ఎన్నికల సామాగ్రికి రక్షణ :** ఎన్నికల సంఘం సూచించిన నియమ, నిబంధనల ప్రకారం ఐదు మున్సిపాలిటి పరిధిలోని ఎన్నికల సామాగ్రికి పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయుధ పోలీసుల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఎన్నికల సామాగ్రి తరలింపులో ఎన్నికల నిర్వాహణ అధికారులతో పాటు రూట్ మొబైల్ సిబ్బంది భద్రతగా ఉంటారని తెలిపారు.